## లవ్లీనాకు రజతం



ఢిల్లీ: చెక్ రిపబ్లిక్ వేదికగా జరిగిన గ్రాండ్ ప్రిక్స్ 2024 బాక్సింగ్ టోర్నీలో భారత మహిళా బాక్సర్ లవ్లీనా బోర్గొహెయిన్ రజత పతకం సాధించింది. శనివారం ముగిసిన ఫైనల్ బౌట్‌లో లవ్లీనా.. 2-3తో చైనా బాక్సర్ లి కియాన్ చేతిలో పోరాడి ఓడింది. పారిస్ ఒలింపిక్స్‌కు ముందు ఇలాంటి పోటీల్లో పాల్గొని పతకం సాధించడం తనలో ఆత్మవిశ్వాసాన్ని నింపిందని రజతం నెగ్గిన తర్వాత విడుదల చేసిన వీడియోలో లవ్లీనా పేర్కొంది.

## ఉత్కంఠ పోరులో పాక్‌దే గెలుపు

**పోరాడి ఓడిన ఐర్లాండ్**



షహీన్ (3/22)

ఫ్లోరిడా: టీ20 ప్రపంచకప్‌లో ఇప్పటికే సూపర్-8 రేసు నుంచి తప్పుకున్న పాకిస్థాన్.. ఈ టోర్నీలో తమ ఆఖరి మ్యాచ్‌ను విజయంతో ముగించింది. ఫ్లోరిడా వేదికగా ఆదివారం ఐర్లాండ్‌తో జరిగిన 'లో స్కోరింగ్ థ్రిల్లర్'లో 3 వికెట్ల తేడాతో గెలిచింది. ఐర్లాండ్ నిర్దేశించిన 107 పరుగుల ఛేదనలో తడబడ్డా.. పాక్ సారథి బాబర్ ఆజమ్ (32 నాటౌట్), షహీన్ షా అఫ్రిది ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆ జట్టుకు ఓదార్పు విజయం దక్కింది. ఐర్లాండ్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 106 పరుగులకే పరిమితమైంది. డెలాని (31), జోషువా లిటిల్ (22 నాటౌట్) మెరుపులతో ఆ జట్టు మూడంకెల స్కోరు చేయగలిగింది. షహీన్ షా అఫ్రిది (3/22), ఇమాద్ వసీం (3/8) రాణించారు. స్వల్ప ఛేదనలో పాక్ సైతం తడబడింది. రిజ్వాన్ (17), సయీమ్ (17) ఫర్వాలేదనిపించారు. వన్‌డౌన్‌లో వచ్చిన బాబర్ చివరిదాకా క్రీజులో నిలిచి కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఆఖర్లో అబ్బాస్ అఫ్రిది (17) ఔట్ అయినా షహీన్ (13 నాటౌట్) రెండు భారీ సిక్సర్లతో ఐర్లాండ్ ఆశలపై నీళ్లు చల్లాడు. షహీన్‌కే 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.



మంధాన (117)

# అమ్మాయిలు అదుర్స్

**తొలి వన్డేలో భారత్ భారీ విజయం • చిత్తుగా ఓడిన దక్షిణాఫ్రికా**

**మంధాన శతకం • రాణించిన శోభన, దీప్తి**



శోభన (4/21)

బెంగళూరు: స్వదేశంలో దక్షిణాఫ్రికాతో జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా తొలి వన్డేలో భారత మహిళల క్రికెట్ జట్టు సమిష్టి ప్రదర్శనతో శుభారంభం చేసింది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా ఆదివారం జరిగిన మొదటి వన్డేలో భారత్.. దక్షిణాఫ్రికాపై 143 పరుగుల భారీ తేడాతో ఘనవిజయం సాధించింది. టీమ్‌ఇండియా వైస్ కెప్టెన్ స్మృతి మంధాన (127 బంతుల్లో 117, 12 ఫోర్లు, 1 సిక్సర్) కెరీర్‌లో ఆరో శతకంతో కదం తొక్కగా దీప్తి శర్మ (37, 2 వికెట్లు), పూజా వస్త్రకార్ (31, 1 వికెట్) ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టారు. అరంగేట్ర మ్యాచ్‌లోనే ఆశా శోభన (4/21)సత్తాచాటింది. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన భారత్.. నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 265 పరుగులు చేసింది. అనంతరం సఫారీ మహిళల జట్టు.. 37.4 ఓవర్లలో 122 పరుగులకే చేతులెత్తేసింది. మంధానకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. ఇరు జట్ల మధ్య రెండో వన్డే ఇదే వేదికపై ఈనెల 19న జరుగుతుంది.

### స్మృతి సూపర్:

కొద్దిరోజుల క్రితమే బెంగళూరులో ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) రెండో సీజన్‌లో రెచ్చిపోయిన స్మృతి.. తొలి వన్డేలోనూ ఆ ఫామ్‌ను కొనసాగించింది. సహచర బ్యాటర్లు షఫాలీ వర్మ (7), హేమలత (12), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (10), జెమీమా రోడ్రిగ్స్ (17), రిచా ఘోష్ (3) విఫలమైనా లోయరార్డర్ బ్యాటర్లు దీప్తి, పూజా అండతో భారత్‌కు పోరాడగలిగే స్కోరును అందించింది. ఓపెనర్‌గా బరిలోకి దిగిన మంధాన..43వ ఓవర్లో శతకాన్ని పూర్తిచేసింది.

### కట్టడిచేసిన దీప్తి, శోభన:

మోస్తరు ఛేదనలో సౌతాఫ్రికా ఏ దశలోనూ లక్ష్యం దిశగా సాగలేదు. కెప్టెన్ లారా వోల్వార్డ్ట (4)ను రేణుకా సింగ్ తొలి ఓవర్లోనే బౌల్డ్ చేసి భారత్‌కు బ్రేక్ అందించింది. బ్రిట్స్ (18), అన్నెకె (5) సారథినే అనుసరించారు. 33 పరుగులకే 3 వికెట్లు కోల్పోయిన దక్షిణాఫ్రికాను సునె లుస్ (33), మరిజన్నె కాప్ (24) ఆదుకునే యత్నం చేశారు. కానీ ఆశా శోభన రంగ ప్రవేశం చేశాక సఫారీల ఆటలు సాగలేదు. లోయరార్డర్ బ్యాటర్లు చేతులెత్తేయడంతో పర్యాటక జట్టుకు భారీ ఓటమి తప్పలేదు.

**సంక్షిప్త స్కోర్లు:**

భారత్: 50 ఓవర్లలో 265/8 (స్మృతి 117, దీప్తి 37, అయబొంగ 3/47, క్లాస్ 2/51).దక్షిణాఫ్రికా: 37.4 ఓవర్లలో 122 ఆలౌట్ (సునె 33, కాప్ 24, శోభన 4/21, దీప్తి 2/10)

**2** ఈ మ్యాచ్‌లో సెంచరీ చేయడంతో అంతర్జాతీయ క్రికెట్‌లో స్మృతి 7 వేల (7,059) పరుగుల మార్కును దాటి ఈ ఘనత సాధించిన రెండో భారత ప్లేయర్‌గా రికార్డులకెక్కింది. మాజీ సారథి మిథాలీ రాజ్ (10,868) అగ్రస్థానంలో ఉంది.

## భజన్‌కు స్వర్ణం

**పారిస్ బెర్తు దక్కించుకున్న యువ ఆర్చర్**



అంటల్యా: 'ఫైనల్ ఒలింపిక్ క్వాలిఫయర్స్'లో భారత యువ ఆర్చర్ భజన్ కౌర్ స్వర్ణ పతకం గెలిచి సత్తా చాటింది. టర్కీ వేదికగా జరుగుతున్న ఈ టోర్నీలో 18 ఏండ్ల కౌర్.. మహిళల వ్యక్తిగత రికర్వ్ ఈవెంట్ ఫైనల్‌లో 6-2 (28-26, 29-29, 29-26, 29-29)తో మొబినా ఫల్లా (ఇరాన్)ను మట్టికరిపించి పసిడి గెలుచుకుంది. పూర్తి ఏకపక్షంగా సాగిన ఫైనల్‌లో నెగ్గిన కౌర్.. పారిస్ ఒలింపిక్స్‌లో బెర్తునూ సాధించింది. ఈ ఈవెంట్‌లో మూడో సీడ్‌గా బరిలోకి దిగిన కౌర్.. బిషిండె (మంగోలియా), ఉర్స్క (స్లోవేనియా)ను ఓడించి సెమీఫైనల్ చేరింది. సెమీస్‌లో అలెగ్జాండ్రాను చిత్తచేసి ఫైనల్‌కు అర్హత సాధించింది. ఇదే పోటీలలో మరో భారత ఆర్చర్ అంకిత.. క్వార్టర్స్ చేరడంతో ఆమె కూడా పారిస్ కోటా దక్కించుకుంది. భారత స్టార్ ఆర్చర్ దీపికా కుమారి తొలి రౌండ్‌లోనే వెనుదిరిగి నిరాశపరిచింది.

## స్టార్ ప్యాడ్లర్లను నిలుపుకున్న ఫ్రాంచైజీలు

• **అల్టిమేట్ టేబుల్ టెన్నిస్-2024**



ఢిల్లీ: ఈ ఏడాది ఆగస్టు-సెప్టెంబర్ మధ్య జరుగబోయే అల్టిమేట్ టేబుల్ టెన్నిస్ (యూటీటీ)- 7వ సీజన్ కోసం ఐదు ఫ్రాంచైజీలు తమ స్టార్ ప్యాడ్లర్లను రిటైన్ చేసుకున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న ప్రముఖ భారత ప్యాడ్లర్లు పాత ఫ్రాంచైజీలకే ఆడనున్నారు. గతేడాది రన్నరప్‌గా నిలిచిన చెన్నై లయన్స్.. ఆచంట శరత్ కమల్‌ను తమ వద్దే అట్టిపెట్టుకోగా మణికా బత్రాను బెంగళూరు స్మాషర్స్ రిటైన్ చేసుకుంది. డిఫెండింగ్ చాంపియన్ గోవా చాలెంజర్స్ హర్మీత్ దేశాయ్‌ను, దబాంగ్ ఢిల్లీ సతియన్ జ్ఞానశేఖర్‌ను.. యూ ముంబా యువ ఆటగాడు మానవ్ ఠక్కర్‌ను నిలుపుకున్నట్టు యూటీటీ ఓ ప్రకటనలో వెల్లడించింది. భారత టేబుల్ టెన్నిస్ సమాఖ్య (టీటీఎఫ్ఐ) ఆధ్వర్యంలో 2017 నుంచి నిర్వహిస్తున్న ఈ టోర్నీలో ఈ ఏడాది నుంచి 8 జట్లు తలపడనున్నాయి. నిబంధనల ప్రకారం ఆరు పాత ఫ్రాంచైజీలు ఒక భారత ఆటగాడిని రిటైన్ చేసుకోవడానికి అవకాశం ఉండగా పునేరి పల్టన్ తప్ప మిగిలిన ఐదు జట్లూ రిటైన్ ప్రక్రియను పూర్తిచేశాయి. ఈ సీజన్ నుంచి కొత్తగా ఎంట్రీ ఇస్తున్న జైపూర్ పాట్రియట్స్, అహ్మదాబాద్ ఎస్‌జీ పైపర్స్ త్వరలో విడుదల కాబోయే 'ఫస్ట్ డ్రాఫ్ట్' నుంచి ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది.

## ఇంగ్లండ్‌ను బతికించిన స్కాట్లాండ్



సెయింట్ లూసియా: పొట్టి ప్రపంచకప్‌లో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగినా వరుసగా వరుస షాకులతో పాటు గ్రూపు దశలో ఆస్ట్రేలియా చేతిలో ఓడటంతో తదుపరి దశకు ముందంజ వేస్తుందా? లేదా? అన్న అనుమానాల నడుమ ఇంగ్లండ్ ఎట్టకేలకు సూపర్-8కు చేరింది. ఆస్ట్రేలియాతో ఆఖరి గ్రూప్ మ్యాచ్‌లో స్కాట్లాండ్ పోరాడి ఓడటంతో బట్లర్ సేనకు రూట్ క్లియర్ అయింది. అంతకుముందు ఇంగ్లండ్.. వర్షం కారణంగా పది ఓవర్లే సాధ్యమయిన మ్యాచ్‌లో నమీబియాను ఓడించడంతో ఆ జట్టు ఊపిరి పీల్చుకుంది.

### బ్రూక్, బెయిర్ స్టో బాదుడు

అంటిగ్వా వేదికగా నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ 41 పరుగుల (డక్‌వర్త్ లూయిస్) తేడాతో నెగ్గింది. వర్షం కారణంగా 10 ఓవర్ల ఆటే సాధ్యమైన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లీష్ జట్టు.. హ్యారీ బ్రూక్ (47 నాటౌట్), బెయిర్ స్టో (31) బాదడంతో 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 122 పరుగులు చేసింది. నమీబియా 10 ఓవర్లలో 84/3 వద్దే ఆగిపోయింది. మైకెల్ వాన్ లింగెన్ (33) ధాటిగా ఆడినా ఆ జట్టును గెలిపించలేకపోయాడు.

### పోరాడి ఓడిన స్కాట్లాండ్

సెయింట్ లూసియా లోని డారెన్ సామి అంతర్జాతీయ స్టేడియం వేదికగా స్కాట్లాండ్-ఆస్ట్రేలియా మధ్య ఆదివారం జరిగిన మ్యాచ్‌లో కంగారూలు 5 వికెట్ల తేడాతో నెగ్గారు. మొదట బ్యాటింగ్ చేసిన స్కాట్లాండ్.. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. బ్రాండన్ మెక్‌ముల్లెన్ (34 బంతుల్లో 60, 2 ఫోర్లు, 6 సిక్సర్లు), బెర్రింగ్టన్ (31 బంతుల్లో 42 నాటౌట్, 1 ఫోర్, 2 సిక్సర్లు) వేగంగా ఆడి భారీ స్కోరు సాధించారు. ఛేదనలో ఆస్ట్రేలియా 19.4 ఓవర్లలో లక్ష్యాన్ని అందుకుంది. ట్రావిస్ హెడ్ (49 బంతుల్లో 68, 5 ఫోర్లు, 4 సిక్సర్లు) దూకుడుగా ఆడినా వార్నర్ (1), మార్ష్ (8), మ్యాక్స్‌వెల్ (11) విఫలమయ్యారు. కానీ ఆ జట్టు స్టార్ ఆల్‌రౌండర్, 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' మార్కస్ స్టోయినిస్ (29 బంతుల్లో 59, 9 ఫోర్లు, 2 సిక్సర్లు) వీరవిహారం చేయడంతో ఆసీస్ విజయతీరాలకు చేరింది. ఆఖర్లో స్కాట్లాండ్ బౌలర్లు కట్టడి చేసినా టిమ్ డేవిడ్ (29 నాటౌట్) గెలుపు లాంఛనాన్ని పూర్తిచేశాడు.

**ఉత్కంఠ పోరులో ఆసీస్ చేతిలో ఓటమి**

**నమీబియాపై గెలుపుతో సూపర్-8కు బట్లర్ సేన**



## ఇటలీ, నెదర్లాండ్స్ బోణీ



అలెస్సాండ్రో

హాంబర్గ్: యూరో కప్-2024లో డిఫెండింగ్ చాంపియన్ ఇటలీ బోణీ కొట్టింది. హాంబర్గ్ (జర్మనీ) వేదికగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో 2-1తో అల్బేనియను ఓడించింది. ఇరు జట్ల మధ్య హోరాహోరిగా సాగిన పోరులో అల్బేనియా తరపున ఆట తొలి నిమిషంలోనే నెడిమ్ బజ్రామి గోల్ చేసినా ఆ తర్వాత ఇటలీ పుంజుకుంది. అలెస్సండ్రొ బస్తోని (11వ నిమిషంలో), నికొలా బరెల్ల (16వ) గోల్స్ సాధించారు. మరో పోరులో నెదర్లాండ్స్.. 2-1తో పోలండ్‌పై గెలిచింది. ఆడమ్ బుకస 16వ నిమిషంలో పోలండ్‌కు ఏకైక గోల్ చేయగా డచ్ జట్టుకు గక్పొ తొలి గోల్ అందించాడు. ఆట మరికొద్దిసేపట్లో ముగుస్తుందనగా 83వ నిమిషంలో వెఘొర్ట్స్ గోల్ చేసి నెదర్లాండ్స్‌కు విజయాన్ని అందించాడు.

# నాలో సూపర్‌పవర్స్ ఆవహిస్తాయ్..



**రామ్‌చరణ్** ప్రస్తుతం పుత్రికోత్సాహంలో మునిగి తేలుతున్నారు. ఫాదర్స్ డే సందర్భంగా తండ్రిగా తన అనుభవాలను పంచుకున్నారాయన. క్లింకార ఆగమనంతో తన ఇల్లు ఆనందాల నందనవనంగా మారిందని రామ్‌చరణ్ అంటున్నారు. ఇంకా చెబుతూ 'అప్పుడే క్లింకార పుట్టి ఏడాది కావస్తోంది. రోజులన్నీ క్షణాల్లా గడిచిపోతున్నాయి. క్లింకార, ఉపాసనల బంధం చూస్తుంటే ముచ్చటేస్తుంది. క్లింకారే లోకంగా బతుకుతున్నది ఉపాసన. అలా బతకడం తల్లికి మాత్రమే సాధ్యం. క్లింకార ఇప్పుడిప్పుడే మనుషుల్ని గుర్తుపడుతోంది. రోజూ తనకు అన్నం పెట్టేది నేనే. తనకు గోరుముద్దలు కలిపి పెట్టేటప్పుడు నాలో సూపర్‌పవర్స్ అవహిస్తాయి. రోజుకు రెండు సార్లు తనకి అన్నం కలిపి పెడతాను. నేను పెడితే గిన్నె ఖాళీ అయిపోవాల్సిందే.' అంటూ తన కుమార్తె గురించి సంబరంగా చెప్పారు రామ్‌చరణ్. ఇంకా మాట్లాడుతూ 'షూటింగ్స్‌కి వెళ్లినప్పుడు తనని ఎంతగానో మిస్ అవుతున్నాను. క్లింకార స్కూల్‌లో జాయిన్ అయ్యేంతవరకైనా తనతో ఎక్కువ సమయం గడిపేలా నా చిత్రాల షెడ్యూల్స్ ప్లాన్ చేసుకోబోతున్నాను.' అని తెలిపారు రామ్‌చరణ్. క్లింకారతో ఉన్నప్పుడు తన తండ్రి చిరంజీవి చిన్నపిల్లాడిగా మారిపోతారని, 'నన్ను తాత అని పిలవకు.. చిరుత అని పిలువ్..' అంటూ మురిసిపోతారని ఆనందం వెలిబుచ్చారు రామ్‌చరణ్.

## పాత్రలో ఊహించని కోణాలు



ఫహాద్ ఫాజిల్ మలయాళంలో పెద్ద హీరో. గొప్ప నటుడు కూడా. అందుకే ఆయనుంటే పాత్ర పరంగానూ, బిజినెస్ పరంగానూ సినిమా ప్లస్ అవుతుందని సుకుమార్ 'పుష్ప' ఫ్రాంచైజీలో ఆయన్ను తీసుకున్నారు. తొలిపార్ట్‌లో ఫహాద్ కేరక్టర్ కొంతే ఉన్నా.. రానున్న 'పుష్ప 2'లో మాత్రం ఆయన పాత్రే కీలకం. ఇందులో అల్లు అర్జున్, ఫహాద్ ఫాజిల్ పాత్రలు నువ్వా-నేనా అనేలా ఉంటాయని తెలుస్తున్నది. ముఖ్యంగా ఫహాద్ పాత్రలో ఊహించని కోణాలు ఉంటాయట. లొకేషన్‌లో ఫహాద్ నటన చూసి యూనిట్ సభ్యులు మెస్మరైజ్ అయిపోతున్నారట. ఇదిలావుంటే.. ఈ సినిమాకు ఫహాత్ ఫాజిల్ రోజువారీ రెమ్యునరేషన్ తీసుకుంటున్నారని వినికిడి. రోజుకు ఆయన పారితోషికం పన్నెండు లక్షలని తెలుస్తున్నది. అంతేకాదు, తనొచ్చాక పొరపాటున షూటింగ్ కేన్సిల్ అయితే.. పన్నెండుకి ఇంకో రెండు కలిపి, పధ్నాలుగు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారట. ఫిల్మ్ సర్కిల్స్‌లో చర్చనీయాంశంగా నిలిచిన విషయమిది.

## మాస్ జాతరకు రంగం సిద్ధం



'ఎన్‌బీకే 109' సినిమాపై అదిరిపోయే అప్‌డేట్ వచ్చేసింది. ఈ సినిమాను అక్టోబర్ 10న విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఏపీ ఎన్నికల కారణంగా కొన్ని నెలలు ఈ సినిమా షూటింగ్‌కి విరామం ఇచ్చిన బాలకృష్ణ.. ఎట్టకేలకు మళ్లీ ఈ సినిమా సెట్‌లోకి ఎంటరయ్యారు. ఓ నెలన్నర షూటింగ్‌తో టాకీ పార్ట్ మొత్తం పూర్తవుతుందని సమాచారం. బాలకృష్ణ, బాబీడియోల్, దుల్కర్ సల్మాన్ కాంబినేషన్ సీన్స్ ఈ షెడ్యూల్‌లో చిత్రీకరిస్తారట దర్శకుడు కె.ఎస్.రవీంద్ర(బాబీ). ఈ సినిమాకు 'ఊరమాస్' అనే టైటిల్ అనుకుంటున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. కానీ అధికారిక ప్రకటన అయితే రాలేదు. ఊర్వశీ రౌటేలా, చాందినీ చౌదరి కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రాన్నీ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్న విషయం తెలిసిందే.

చిత్రం




# రియల్‌హీరో విశ్వక్‌సేన్

రీల్ హీరో విశ్వక్‌సేన్ రియల్ హీరో అనిపించుకున్నారు. తన అవయవాలను దానం చేసి ఎందరికో ఆదర్శంగా నిలిచారాయన. అవయవ దానానికి మద్దతిస్తూ, దానిపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన 'మెట్రో రెట్రో నోబుల్ కాజ్ ఈవెంట్'కు అతిథిగా వెళ్లిన విశ్వక్, ఆ వేడుకలో తన అవయవాలను దానం చేస్తున్నట్టు ప్రకటించారు. ఇంత గొప్ప నిర్ణయం తీసుకున్న విశ్వక్‌పై ఆ కార్యక్రమంలో పాల్గొన్న అందరూ ప్రశంసల వర్షం కురిపించారు. ప్రతిఒక్కరూ ఈ బృహత్తర కార్యక్రమంలో భాగం కావాలనీ, తద్వారా అనేకమంది ప్రాణాలను కాపాడాలని విశ్వక్ కోరారు. దర్శకుడు శైలేష్ కొలను కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## దెయ్యమై చంపుతుంది ఆ అమ్మాయే..



వెన్నెలకిశోర్, నందితా శ్వేత ప్రధానపాత్రల్లో నటించిన హారర్, కామెడీ ఎంటర్‌టైనర్ 'ఓఎంజీ'. 'ఓ మంచి ఘోస్ట్' అనేది ఉపశీర్షిక. శంకర్ మార్తాండ్ దర్శకుడు. డా.అబినికా ఇనాబతుని నిర్మాత. ఈ నెల 21న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా థియేట్రికల్ ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. 'ఈ బంగ్లాలో ఓ అమ్మాయిని చంపేశారు.. ఆ అమ్మాయే దెయ్యమై అందర్నీ చంపేస్తోందని కథలుకథలుగా చెప్పుకుంటున్నారు' అనే డైలాగ్‌తో ఈ ట్రైలర్ మొదలైతే.. 'ఇప్పటివరకూ ఆటాడితే ఎలా ఉంటుందో చూశారు.. ఇక వేటాడితే ఎలా ఉంటుందో చూపిద్దాం' అనే డైలాగ్‌తో ట్రైలర్ ముగిసింది. ఈ సినిమాలో సూపర్ నేచురల్, హారర్, థ్రిల్లింగ్, కామెడీ.. ఇలా అన్ని ఎలిమెంట్స్ ఉంటాయని, ట్రైలర్‌ని మించే స్థాయిలో సినిమా ఉంటుందని, భయపెడుతూ, నవ్వించే సినిమా ఇదని మేకర్స్ తెలిపారు. నవమి గాయక్, షకలక శంకర్, రజత్ రాఘవ్, తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: ఐ ఆండ్రూ, సంగీతం: అనూప్ రూబెన్స్.



## చౌకీదార్.. ఓ కుటుంబకథ

కన్నడ నటుడు పృథ్వీ, కన్నడ దర్శకుడు చంద్రశేఖర్ బండియప్ప కలిసి నిర్మిస్తున్న చిత్రం 'చౌకీదార్'. నిర్మాతల్లో ఒకరైన పృథ్వీ ఇందులో కథానాయకుడు కాగా, మరో నిర్మాత చంద్రశేఖర్ బండియప్ప దర్శకుడు. కన్నడ స్టార్ శ్రీమురళి చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందిస్తూ ఈ టైటిల్‌ను ప్రకటించారు. కన్నడతోపాటు పలు ఇతర భాషల్లో కూడా ఈ సినిమాను విడుదల చేయనున్నట్టు మేకర్స్ తెలిపారు. టైటిల్‌ను చూసి ఇది మాస్ సినిమా అనుకోవద్దని, నిజానికి ఇది కుటుంబకథాచిత్రమని, చంద్రశేఖర్ బండియప్ప సరికొత్త కథతో మీ ముందుకు రానున్నారని పృథ్వీ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: సచిన్ బస్రూర్.

## అంజలి బహిష్కరణ



విలేజ్ రివేంజ్ డ్రామా నేపథ్యంలో రూపొందుతోన్న వెబ్ సిరీస్ 'బహిష్కరణ'. అంజలి ఇందులో ప్రధాన పాత్రధారి. ముఖేశ్ ప్రజాపతి దర్శకుడు. జీ 5, ఫిక్సల్ పిక్చర్స్ ఇండియా సంస్థలు కలిసి ఈ సిరీస్‌ని నిర్మిస్తున్నాయ్. అంజలి పుట్టినరోజు సందర్భంగా ఆదివారం ఈ వెబ్‌సిరీస్ మోషన్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. మంటల్లో కాలిపోతున్న ఓ కుర్చీ.. దాని పక్కనే వేటకొడవలి పట్టుకొని కోపంగా కూర్చున్న అంజలి.. పోస్టర్‌తోనే వెబ్‌సిరీస్‌పై ఆసక్తిని పెంచారు మేకర్స్. ఇందులో అంజలి పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. త్వరలో స్ట్రీమింగ్‌కి రానున్న ఈ సిరీస్‌లో రవీంద్ర విజయ్, శ్రీతేజ్, అనన్య నాగళ్ల, షణ్ముక్, చైతన్యసాగిరాజు తదితరులు ఇతర పాత్రధారులు. ఈ సిరీస్‌కి కెమెరా: ప్రసన్నకుమార్, సంగీతం: సిద్ధార్థ్ సదాశివుని, నిర్మాత: ప్రశాంతి మలిశెట్టి.

## ఎక్కడ చూసినా అద్భుతమైన రెస్పాన్స్



'మంచి సినిమా తీస్తామని ముందునుంచీ చెబుతున్నాం. ఇప్పుడదే జరిగింది. ఎక్కడ చూసినా అద్భుతమైన రెస్పాన్స్. దర్శకులు మారుతీ, సంపత్ నంది ఫోన్లు చేసి మరీ అభినందించారు' అంటూ ఆనందం వ్యక్తం చేశారు నిర్మాతలు సుబ్రహ్మణ్యం, సుమంత్. వారు నిర్మించిన యాక్షన్ డ్రామా 'హరోంహర'. సుధీర్‌బాబు హీరోగా జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఇటీవల విడుదలైంది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడారు. ప్రభాస్, రామ్‌చరణ్‌లతో కూడా సినిమాలు నిర్మించాలని ఉందంటూ.. తమ సంస్థనుంచి మరో రెండుప్రాజెక్టులు రానున్నాయని, ఆ వివరాలు త్వరలో చెబుతామని సుబ్రహ్మణ్యం, సుమంత్ అన్నారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.